# గగనకుసుమం

శ్రీ ఆర్యసోమయాజుల లక్ష్మీనరసింహ సోమయాజులు.

---

నిత్యమూ ప్రకృతిలో జరిగే సంఘటనలు యీ ప్రకృతిలో సంచరించేమానవులకే అర్థంగాక, ప్రకృతి గర్భంలోనే మాటుమడిగి వుండిపోతుంటాయి.

ఎన్ని అవస్థలు పడాలో, అన్నీపడుతున్న రోజులవి. తీయని వాతావరణంలో తిరిగిన నాకు యీ జీవితం కష్టం అనిపించకపోలేదు మొదట్లో.

ఏకవైనా నా జీవితాన్ని విన్నాడంటే, చక్కని చిన్నఖండకావ్యాన్ని వ్రాసేస్తాడు.

ఇక్కడికి వచ్చినతరువాత ముఖపరిచయ గ్రహాలు లేకపోయేసరికి నల్లమందు భాయిలా తయారైనాను. నాతత్వానికి యించుమించుగా సరిపడ్డవారు రాజు, నాథం తప్ప మరెవ్వరూ కనపట్టంలేదు యీ వాతావరణంలో, రాజుదదో వైఖరి. మితభాషి. గడి గడీకి అభిప్రాయాల మారుతై. నాథంవున్నాడంటే మరి చెప్పనక్కర్లేదు, నాబాపతే. ఆలోచించి, ఆలోచించి పాడు పనులు చేస్తుంటాడుగాని సమయం దొరుకుతే చాలా డాబుగా హాయిగా జీవించాలంటాడు. మా ముగ్గురిలోవుండే మంచివిషయమేమిటంటే ఎవ్వరిలోనూ ఈర్ష్య అన్నదిలేదు.

ఆ ఇసుకతిన్నెలమీద కూర్చుని సముద్రపు కెరటాలమీంచొచ్చే పిల్లవాయువుల్ని ఆనందించే సమయంలో, నా జీవితంలోని పాతప్రకరణాలని ఎవరో తిరగవేస్తునట్టుండేది. హృదయంలో ఆవేదన బయలుదేరేది.

నిజంగా ఒకపుడు యీ సాయంకాలమే నాకెక్కువ ఆనందాన్ని చేకూర్చిన ఘట్టాలెన్నో వున్నయి. ఎపుడు సూర్యుడుక్రుంకుతాడా అని నిరీక్షిస్తుండేవాడిని. నాహృదయంలో అగ్రస్థానం వహించిన సాయం సమయమే యిపుడు విషతుల్యమైంది.

ఆనాటాదివారం మూలంగా ఆఫీసుకు శలవు దొరకింది, బీచిఒడ్డున ఒకపెద్ద యిసుకతిన్నెమీద కూర్చున్నా దూరాన్నుంచి వస్తున్న స్టీమరుని చూస్తూ.

వినుగు విరామంలేకుండా వస్తున్నాయి కెరటాలు ఎన్నో. నీరు ఒడ్డుననున్న పీతబోరియల్లో దూరి, బుడ బుడ, మంటోంది. చందమామ కెరటాలమధ్యని ఊయలలూగుతున్నాడు. చిన్న పడుతున్నాయి. ప్రక్కనున్న మొగలిపొదల్లోంచి కమ్మని వాసనలు పూవులు గ్రుమ్మరిస్తున్నాయి.

ఆ సమయంలో శాంతిగానున్న నా ప్రశాంత హృదయంలో, చటుక్కున నా ఒంటరి జీవితం తలుపుకొచ్చింది. యెక్కడాలేని ఆవేదనా వచ్చి నిండిపోయింది హృదయం.

ఆవేదనలోనూ తృప్తివుంది, నిరాశలోనూ ఆశవుంది, చీకటిలోనూ వెలుతురుంది, నాలోనూ ఆనందంవుంది. ప్రకృతిసౌందర్యాన్ని ఎంతసేపైనా చూస్తో ఆనందించొచ్చు. కాని——అదీ——ఆనందమేనా?——అని.

మనిషి అలికిడి అయింది. కేరింతాలు వినబడ్డాయి. దూరాన్నుంచి ఎవరో ఇద్దరు వ్యక్తులు ఇసుకలో నడుచుకుంటూ కిలకిల నవ్వుకుంటూ నావైపే వస్తున్నారు, ముందుకు వస్తున్నకొద్ది ఎవరా వ్యక్తులని పెద్దసంశయం బయలుదేరింది, దగ్గరపడుతున్నకొద్దీ అందోళన ఎక్కువైంది. సముద్రపుఘోష భోరుమంటోంది. హృదయం వేగంగా కొట్టుకోటం మొదలెట్టింది. అక్కడ మరి కూర్చోలేకపోయాను. వెళ్ళిపోదామని చటుక్కునలేచా.

ఒకరిచెయ్యొకరు జోడించుకుని విలాసంగా హాసంగా, ఆయాసంగా గాలికి ముఖంమీద పడుతూన్న జుత్తుకొనలను సరిచేసుకొంటూ వస్తూన్న వారు నన్ను చూసేసరికి ఒక్కసారి వారి సంభాషణ ఆగిపోయింది. చటుక్కున స్త్రీవ్యక్తి ఆగింది.

వెనుక తిరిగి ముందుకుపోతున్నా.

రెండడుగులు ముందుకు వేశా.

"ఎవరది?"—స్త్రీ కంఠం.

---

"యాజులూ."

———ముందుకు నడక ప్రారంభించా వడి వడిగా. యాజులూ—యాజూ—ఆమె దగ్గరకొచ్చి ——అలా "చూస్తావేం? అపుడే—మరచిపోయావా?"

——లే——దు——

"నువ్వా యీ వూళ్ళోనేనా వున్నావు? ఒకసారీ కనుపించలేదే. ఇలా ఒక్కడివి కూర్చుని ఏం చేస్తున్నావ్?"

‘‘

"తిరిగి ఎన్నాళ్ళకి కలుసుకున్నామోయ్. అయితే నీబసెక్కడ?"

"యీ వూళ్ళోనే"

"నీకేం మతిపోయిందేమిటి! యీ వూళ్ళోనే అని తెల్పు ఏ వీధిలో అని—ఓహో మరచాను వండుక్కి అత్తారింటికి వచ్చావా నీవు—"

"కాదు యిక్కడ పనిచేస్తున్నా."

"అయితే యికనేం ఏమిటీ వేషమంతాను?"

"ఎలాగుండాలో అలాగేవున్నాను."

"వెర్రిబాగులవాడా నీలో చాలా మార్పు వచ్చిందోయ్."

"అవును. ఇంకా వస్తుందనికూడా తెలుసు." అన్నాను.

నవ్వుతూ "మరిరాదులే. రాకుండా మందిస్తాను రేపట్నుంచి మాయింటికొస్తూండు....——వస్తావా?"

"ఇతనెవరేమిటి?" అని ఆమె బుజంతడుతూ అడిగాడాయన మా సంభాషణంతా విని.

"జ్ఞాపకంలేదూ ?——అతని ముఖంలోకి చూస్తూ——యాజులని ——అపుడే మరచిపోయాడూ ?"

"నా క్లాసుమేటు మంచికవి. బాగాపాడ్తాడు. కూడాను—అతనే. అవునుగాని యాజులూ—ఏదో సమయంలో నువ్వు రోజూ నాకు జ్ఞాపకం వస్తూవుంటావోయ్."

"ఓహో! అలాగా మీరేనా అండి. I am very glad to meet you" అంటూ చేతులు కలిపాడాయన. "రాండి బంగాళాకు పోదాం."

"ఊ——లెండి."

"క్షమించండి.——రేపువస్తా" అన్నాను ఇష్టం లేనట్లుగా.

"తనదంతా అదోరకం. రానంటే మరిరాడు—రేపువస్తాడు. తప్పకుండారావాలిసుమా. మరచిపోకేం" అంటూ ఆమె బంగాళావైపు ముందుగా నడచింది పైటచెరగును పండ్లతోపీకుతూ, ఎక్కువ జాలితో మనోధారుధ్యం పోగొట్టుకునేమనిషిలా.

"వస్తానండీ" అంటూ అతనుకూడా వెళ్ళిపోయాడు మంత్రముగ్ధుడిలా.